


# సర్పశిల

## – భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

ఇప్పటివరకూ జరిగిన కథ

ఎపిసోడ్ :1 (జనవరి)

శృంగి, మట్టు అడవిలో నడుస్తూ ఓ శిథిలాలయానికి చేరుకుంటారు శృంగి బ్రాహ్మణుడు. మట్టు భిల్లుడు. ఆ ఆలయంలో 18 చేతులు గల నిలువెత్తు అమ్మవారు. తిరిగి వచ్చేప్పుడు ఓ భయంకరమైన పాము తోక మీద నిలబడి వారిని అడ్డగిస్తుంది. శృంగి స్పృహ తప్పుతాడు.

ఎపిసోడ్: 2 (ఫిబ్రవరి)

రాబీ వెబ్‌స్టర్ అనే అమెరికన్ ని జయదేవ్ ఏర్‌పోర్ట్ కి వెళ్ళి రిసీవ్ చేసుకుంటాడు. ఆ రాత్రి రాబీ(రాబర్ట్)కి విలియమ్స్ అనే ఆత్మ కనిపిస్తుంది. జయదేవ్ రాబీని తిరుపతి పంపుతూ డ్రైవర్ని చూస్తాడు. ఆ డ్రైవర్ అచ్చు రాబీ వర్ణించిన విలియమ్స్ పోలికతో వుండడం జయ్‌ని విస్మయానికి గురిచేస్తుంది.

ఎపిసోడ్: 3 (మార్చ్)

శృంగి, మట్టూ రామజోగినీ, మధురనీ కలుస్తారు. పాము విషయం మట్టు రామజోగికి వివరిస్తాడు.

జర్నీలో రాబర్ట్ విలియమ్స్‌లా వున్న డ్రైవర్‌తో సంభాషిస్తాడు. శ్రీనివాస్ రాబీని రిసీవ్ చేసుకుంటాడు. రాబీ హోటల్ గదిలో కళ్ళు తిరిగి పడిపోతాడు.

ఎపిసోడ్ 4: (ఏప్రెల్) తక్ష పురం గురించి రామజోగికి వర్ణిస్తాడు మట్టూ. రాబీకి స్పృహ వస్తుంది. శ్రీనివాస్‌తో గోవిందరాజస్వామి ఆలయంలోకి అడుగుపెట్టి చిత్రంగా ఆ గుడంతా పరిచయం ఉన్నట్టు నడుస్తూ తెలుగు మాట్లాడతాడు. స్వామిని చూచి గట్టిగా అరిచి స్పృహ తప్పుతాడు రాబీ. షోలింగర్‌లో జయదేవ్, సుదర్శన్ భట్టాచార్య రాబీ గురించి డిస్కస్ చేస్తారు. రామజోగి మధురని సముదాయిస్తాడు. రాబీ స్పృహలోకి వచ్చి శ్రీనివాస్‌తో విలియమ్స్ గురించి చెబుతాడు.

ఎపిసోడ్:5 (మే) జయ్ శ్రీనివాస్ రాబీ గురించి శాస్త్రిగారితో డిస్కస్ చేస్తారు.

ఎపిసోడ్:6 (జూన్) అందరూ, అంటే జయ్, రాబీ, శ్రీనివాస్, శాస్త్రిగారూ, సుదర్శన్ రెండు కార్లలో పలమనేరు వైపుకి బయల్దేరతారు. శ్రీనివాస్ సామాన్లతో రెండో కారులో ఉంటాడు. వారణాసి, మోహన్ గిరి, కిషన్ బైరాగి గంగాతీరాన పరిచయం అవుతారు. కిషన్ హిందూ మతం వదిలి ఫకీర్‌కి శిష్యుడవుతాడు. ఫకీర్ కిషన్‌కి 'బిదాసీ' అనే శక్తిని చూపుతాడు.

ఎపిసోడ్ 7: (జూలై)

తక్షపురానికి ఓ ముసలిది వస్తుంది. ఆమెకీ సర్పశిలకీ సంబంధం ఏదో ఉందని జనాలు రకరకాలుగా ఊహిస్తుంటారు. ఆలయ పూజారి, ప్రవచకుడూ, ప్రెసిడెంటూ డబ్బులు దండుకునే ఆలోచనలు చేస్తూంటారు. జయ్, శాస్త్రిగారు, రాబీ, సుదర్శన్‌లు వెడుతున్న కారు రోడ్డు పక్కకి పడిపోతుంది.

ఎపిసోడ్ 8 (ఆగస్టు) పెద్ద పుల్లేటి కుర్రు ఆశ్రమంలో కన్యాదేవి, మాయాదేవి మరో పదహారుమంది ఉంటారు. వారిని అక్కడికి పంపింది నిశ్చలానంద (వారణాసి) అవధానీ, హనుమంతు ఆశ్రమం గురించి మాట్లాడుకుంటారు. విలియమ్స్ తూఫానులోనించే శ్రీనివాస్‌తో ఆహారం జలం మొదటి కారు వాళ్ళకి పంపుతాడు.

మట్టూతో బాటు శృంగిని కూడా శిథిలాలయానికి వెళ్ళమని ఆదేశిస్తాడు రామజోగి.

ఎపిసోడ్ 9 (సెప్టెంబర్)

ప్రకృతి ప్రేమికులు, రక్షకులు దేవతలు.

ప్రకృతి నాశకులు రాక్షసులు

ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. ప్రకృతి సేవకులు మానవులు అని శ్రీనివాస్‌కి విలియమ్స్ బోధిస్తాడు. మదాలస హార్స్‌లీ హిల్స్ గురించి సుదర్శన్‌కి వివరిస్తుంది. యజ్ఞనారాయణగారు శాస్త్రిగారు జరుగుతున్న సంఘటనల గురించి చర్చిస్తారు.

ఎపిసోడ్ –10

అవధాని హనుమంతుని హెచ్చరిస్తాడు.అవధాని పాములు లలలోకి రావడం గురించి సూరయ్యగారికి చెబుతాడు .తక్షపురంలో ముసలిది శాపాలు పెడుతూ వికటాట్ట హాసం చేస్తుంది.

తరువాయి భాగం చదవండి ...

**భూగోళానికి అవతలి పక్క: న్యూయార్క్ (మన్‌హట్టన్)లో**

కొలంబియా యూనివర్సిటీ సుమారులో కొన్ని మహా భవంతుల మధ్యన ఓ ఇరవై అంతస్తుల భవనం. దానిపేరు గెలాక్సీ. పదిహేడో అంతస్తులో లిఫ్ట్ ఆగగానే ఎదురుగా ఓ గోల్డ్ లెటర్ బోర్డు కనిపిస్తుంది. మూడే, మూడు బంగారు రంగుతో మెరిసిపోయే అక్షరాలు. G.O.D అని  ఆ పదిహేడో అంతస్తులో చాలా చాలా షాపులు, పురాతన శిల్పాలని అమ్మే యాంటిక్ స్టోర్స్, అరుదుగా దొరికే పూసల దుకాణాలు చాలా వున్నాయి. ఓ ప్రత్యేకమైన దారిగుండా వాటిని దాటుకుని లోపలికెడితే డి3 అనే నంబర్ కలిగిన డోర్. డోర్ బెల్ ప్రెస్ చేశాడు గోర్కీ. గోర్కీ పూర్తిపేరు గోవింద కిషన్. తలుపు తెరుచుకుంది. వెల్‌కమ్ మిస్టర్ గోర్కీ. ఐ యాం మిఖాయిల్ రాజోవ్‌స్కి రష్యన్‌ని పరిచయం చేసుకుంటూ కరచాలనం చేశాడు రాజోవ్ స్కీ. "థాంక్యూ" అన్నాడు గోర్కీ. లోపల మరో ఇద్దరు వున్నారు.

"వీరు పీటర్ స్తిట్సన్ .. వారి పేరు హోవార్ట్ డాంటే. స్తిట్సన్ అమెరికన్, డాంటే బ్రిటీషర్ " వారినీ వారి దేశాల్నీ కూడా పరిచయం చేశాడు రజోవ్ స్కీ.

కరచాలనాలు అయ్యాక స్థిమితంగా కూర్చున్నారు. చుట్టూ చూస్తే అదో యాంటిక్ షాపులానే వుంది. ఐతే దాన్ని బహుశా 'కవర్' కోసం ఏర్పరచి వుండొచ్చు. స్టిట్సన్ లేచి ఓ కప్‌బోర్డ్ నించి విస్కీ గ్లాసులూ, ఐస్ క్యూబ్స్ నిండిన ఫ్లాస్క్ మొదలైనవి తెచ్చి టేబుల్ మీద పెట్టాడు. ఓ ఫ్రెష్ టైం స్క్వేర్ వాటర్ బాటిల్ కూడా మంచు ఓడుతూవుంది.

"యువర్ ప్లెజర్" అని ముందుగా విస్కీ బాటిల్ డాంటేకి ఇచ్చాడు స్టిట్సన్. డాంటే చిన్నగా నవ్వి అన్ని గ్లాసుల్లోనూ కొంచెం కొంచెం పోసి ఐస్‌క్యూబ్స్ వేశాడు. గోర్కీ మాత్రం కొంతన నీరు కలిపాడు.

"వెల్ మిస్టర్ గోర్కీ... మీరు ఇక్కడికి రావడానికి పడ్డ శ్రమ మాకు తెలుసు. అఫ్‌కోర్స్.. మీ ఓపికకీ, మీరు చేసిన ప్రయత్నాలకీ మేము చాలా విస్మయంతో అవాక్కయ్యాము. ఎందుకు అంత శ్రమ తీసుకున్నారో మీరు మాకు చెబుతారా?" సూటిగా ప్రశ్న సంధించాడు హోవార్డ్‌డాంటే.

"నేను ఎంత శ్రమపడానో మీకు తెలిసినప్పుడు నేను ఎందుకు వచ్చానో కూడా మీకు తెలిసేవుండాలి మిస్టర్ డాంటే.. అన్నట్లు మీ పేరు నాకు సుపరిచితం. ఎలా అంటే, కౌంట్ ఆఫ్ మాంటిక్రిస్టో (డాంట్)లో హీరో పేరు ఎడ్వర్డ్ డాంటే. అలాగే మిస్టర్ రాజోవ్‌స్కి మీ పేరు కూడా నాకు తెలిసిందే, అంటే పూర్తిగా కాదనుకోండి. రాజ్ కపూర్ తీసిన మేరా నాం జోకర్‌లో ఓ సర్కస్‌వాలా పేరు ఇవాన్ రాజోవ్‌స్కి " నవ్వి అన్నారు గోర్కీ.

"హ...హ...హ.. ఆవారాహూ" అన్నాడు రాజోవ్ స్కీ.

"యా వియ్ నో దట్ మిస్టర్ గోర్కీ. మీ భారత దేశంలో చాలా చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయి. రాబర్ట్ వెబ్‌స్టర్ అనే అమెరికన్ ఓ ట్రాన్స్ లోనో, కోమా లోనో చాలా కాలం గడపాల్సి వచ్చింది. అతని శరీరం విలియమ్స్ అనే ఓ శ్వేత

జాతీయుడి కంట్రోల్‌లో వుంది. ఓ విలేజ్‌లో ఒక స్నేక్ టెంపుల్‌లో ఒక కింగ్ కోబ్రా స్టాచ్యూ పాయిజన్ కక్కేంత తీవ్రమైన లుక్స్ తో జనాల్ని భయపెడుతోంది. అన్ని స్థంభాల మీద టోటల్‌గా వున్నవి 18 స్నేక్ స్టాట్యూస్. మరో చోట, తలకోనలో ఓ మహాయాగం జరిగింది. బట్, దాని రిజల్ట్ అన్‌నోన్. అవికాక రకరకాల పరిస్థితులు నెలకొన్నాయి. మిస్టర్ రాబీ వెబ్‌స్టర్‌కి మహాభారత కాలంనాటి ఆయుధాలు ఆ సెమీ కాంక్షస్ స్టేట్‌లో కనిపించాయి, అవునా?" గుక్కతిప్పుకోకుండా అన్నాడు పీటర్ స్టిట్సన్. గోర్కీ చిన్నగా నవ్వాడు.

"మిస్టర్ స్టిట్సన్ మీ పరిశోధనా పద్ధతికి నా శాల్యూట్. అబ్జల్యూట్లీ పెర్‌ఫెక్ట్. ఈ ఇన్‌ఫర్‌మేషన్ మీకు వచ్చింది. బహుశా రాబర్ట్ వెబ్‌స్టర్ నించిగానీ, అతని బ్రదర్ నించిగానీ, అతని గాళ్‌ఫ్రెండ్ నికోల్ నించి గాని అయివుండొచ్చు. ఇలా ఇంట్రెస్ట్ పెరగడానికి కారణం రాబీని విలియమ్స్ అనే ఆత్మ కంట్రోల్ చేయడం, రెండోది మనో భారత కాలం నాటి ఆయుధాలు. డియర్ ఫ్రెండ్, ఆ మహా కురుక్షేత్రాన్ని, ఆ సంగ్రామ స్తితిని పరిశోధిస్తే ఆనాటి అస్త్ర శస్త్రాల ఇంపాక్ట్ తెలియడమేగాక అపారమైన ఆభరణాల నిల్వల ఆచూకీ కూడా పట్టవచ్చు. వాళ్ళు వాడినవన్నీ ప్యూర్ గోల్డ్, ప్యూర్ డైమండ్స్ ఎట్సెట్రా. మరో విషయం ఏమంటే, ఓ మహా భయంకరమైన విపత్తు – రాబోతుందని స్పష్టంగా మీ ప్రిడిక్షన్స్ చెబుతున్నాయి. ఈ విషయంలో మీకంటే, మీ ప్రిడిక్టర్స్ చాలా ముందుంటారని మీకు తెలుసు. ఎందుకంటే, ఖగోళ శాస్త్రమూ, జ్యోతిష్యమూ, శబ్దశాస్త్రమూ భారతదేశంలో ఎక్కిన మెట్లు ఏ దేశమూ రాబోయే లక్ష సంవత్సరాలకైనా ఎక్కలేదు. ఆ సంగతి అక్కడ పెడితే, ఇప్పటి సమస్య మీదో మాదో లేక మరో దేశానిదోకాదు. ఈ సమస్య మానవాళిది. మనకున్న ఒకే ఒక ఆప్షన్ మనకున్న సమాచారాన్ని సిన్సియర్‌గా ఇచ్చిపుచ్చుకోవడం. 100% సిన్సియర్‌గా పరిస్థితిని చర్చించి అంచనా వేయడం. మన నలుగురం పరిశోధకులం మాత్రమే. కేవలం నేర పరిశోధకులమో ప్రత్యేక సమస్యా పరిశోధకులమో కాదు. అన్ని దేశాల సెక్యూరిటీ నిఘా సంస్థల ఆయువు పట్లన్నీ తెలిసిన వారం. కనుక, మన పనిని సిన్సియర్‌గా మనం మొదలుపెట్టడం ఉత్తమోత్తమం."

చెప్పాల్సింది నింపాదిగా, ఏ తొట్రుపాటూ లేకుండా చెప్పి ఓ లాంగ్ సిప్ తీసుకున్నాడు గోర్కీ.

"వెల్... మొదట చికాగో ఫైల్‌తో మొదలెడదాం. దిసీజ్ ద వన్" డాషన్ ఆ ఫైల్ తాలూకు కాపీని మిగతా వారికి ఇచ్చాడు. ఓపెన్ చేశాడు గోర్కీ. మిగతా ముగ్గురు ఆ ఫైల్ చదివేసి వుండాలని గోర్కీకి అర్థమయింది.

8.8.1998 చికాగో: రోడ్డుమీద నడుస్తున్న మిస్ ఆరవిల్ మేరీ పిడుగుపడినట్టు భస్మమైపోయింది. ఆమె వెనుకా ముందూ నడుస్తున్న అనేకానేకమంది వ్యక్తులు ఆ సంఘటన చూసి దిగ్భ్రమకి లోనయ్యారు. శరీరం మొత్తం కొన్ని క్షణాల్లో భస్మమైపోవడం, కొన్ని ఎముకలు తప్ప మరేమీ మిగలక పోవడం ప్రజల్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. కారణం ఏమై వుంటుందో ఎవరూ చెప్పలేకపోయారు. కేవలం శబ్దం మాత్రమే వినిపించి బూడిదైపోవడం ఎవరికీ అంతుపట్టలేదు. అణు, రసాయన ఆయుధాలు వాడిన జాడలు ఏమాత్రం కనిపించలేదు. మిగతా వరంతా క్షేమంగా వుండి ఆమె ఒక్కతే యీ

ఘోర సంఘటనకి గురికావడం ఏమిటో ఏ శాస్త్రవేత్తలకీ మింగుడు పడటంలేదు. ఇటువంటి విశేషాల్ని సేకరించే ప్రొఫెసర్ బ్రూక్స్ (జెనీవా), "ప్రతి అరవై అయిదేళ్ళకీ ఇటువంటి సంఘటనలు వివిధ దేశాల్లో జరిగాయి. కారణం యీ ఘటన మానవుడు సృష్టించినది కాదు. బహుశా కొన్ని మానవాతీత శక్తులే ఇటువంటి సంఘటనలు సృష్టిస్తున్నాయని నేను నమ్ముతున్నాను" అంటూ అనేక సంఘటనలను ఆయన వివరించారు. ఆ సంఘటనలన్నీ యీ క్రింద పొందుపరిచాము" అని ఫైల్లో వుంది.

తరువాత పేజీ తిప్పితే 1748 నించి ఆయన ఇటువంటి సంఘటనలనించి సేకరించిన సమాచారం చాలా విపులంగా టైప్ చేసి వున్నది. అంతేగాక అనేక దేశాలనించి సేకరించిన పేపర్ కటింగ్స్, సంపాదకీయాలూ, శాస్త్రవేత్తల అభిప్రాయాలూ, ఆయా దేశాధినేతలు తీసుకున్న జాగ్రత్తలు. అన్నీ వరుస క్రమంలో తేదీల ప్రకారం పొందుపరచి వున్నాయి. మొత్తం 35 పేజీలు. విస్కీ సిప్ చేస్తూ, ఓపిగ్గా, శ్రద్ధగా చదివాడు గోర్కీ.

"అంతేకాదు.. చాలా పెద్ద శాస్త్రజ్ఞుల, రసాయన నిపుణుల సలహాలు తీసుకున్నాం. చాలామంది అన్నది ఏమంటే, శరీరంలో ఒక యాసిడ్ (ఆమ్లం లేక ఆమ్లాలు) అవసరానికంటే కొన్నివేల రెట్లు సడన్‌గా పెరిగిపోతే వచ్చే ఎఫెక్టు ఇలా వుంటుందని. మీ ఇండియన్స్ కొందరు ప్రయోగం అనీ, బాణామతి అనీ చేతబడి అనీ అనేక విధాలుగా చెప్పారు.. కొందరైతే చాలా సిల్లీగా అటువంటి ప్రయోగం చేసి చూపిస్తామని దంబాలు కొట్టారు. ఏదేమైనా, ప్రొఫెసర్ బ్రూక్స్ మాత్రం ఇది శరీరంలో కొన్ని పరిస్థితుల్లో ఏర్పడే రసాయన చర్య అని నమ్మడంలేదు" ఆగాడు డాంటే.

"మరి మీరు?" రజోవ్‌స్కీనీ స్టిట్సన్‌నీ అడిగాడు గోర్కీ. మనం ఉన్నది పరిశోధించడానికి. ఇదొక్కటే కాదు అతి ముఖ్యమైన ఫైల్స్ మరి కొన్ని చదవండి. అప్పుడు చర్చిద్దాం" అన్నాడు స్టిట్సన్.

మరో ఫైల్: 2001 వైట్ రాక్ లేన్ డాలస్ సమీపాన" వైట్ రాక్ లేక్ దగ్గర హాయిగా గడపడానికి వీకెండ్‌కి వచ్చిన ఓ వేన్, అందులో అయిదుగురూ క్షణాల్లో వేన్ పేలిపోయి భస్మమయ్యారు. ఎంట్రెన్స్ సెక్యూరిటీ వారు చనిపోయిన వారి పేర్లూ వేన్ నంబరూ నమోదు చేసుకోవడం వల్ల వారి వివరాలు తెలిశాయి. వారు...(వివరాలు ఫైల్లో నమోదు కా అడ్డాయి.)

ఫైల్" ఒక స్కూల్లో చదువుతున్న 12మంది పిల్లలు కేవలం అయిదు నిమిషాల్లో వృద్ధులుగా మారిపోయారు. వృద్ధులుగా మారక ముందు వారి వయసులు పదినించి పదమూడు. ఒకేసారి వయసు మీదపడడం వల్ల వారి మతిభ్రమించింది. వారు మాట్లాడే భాష మారిపోయి మరో భాషలో అరవడం స్కూలు యాజమాన్యానికి తెలిసి, భాషాపండితుల్ని సంప్రదిచంగా అది భారతదేశంలో నివసించే వాళ్ళు వాడే లిపిలేని ఒక భాష అని తేలింది. పరిశోధన జరుగుతోంది.

ఫైల్: బీహార్ (ఇండియా): పాట్నా (ఒకపప్పటి పాటలీపుత్రం) దగ్గరున్న ఒక 'సర్‌సోయీ' గ్రామంలో మూడురోజులపాటు ఏడు బావుల నించి స్వచ్ఛమైన పెట్రోల్ పైకి ఉబికి వచ్చింది. జనాలు తండాలు తండాలుగా ఆ సర్‌సోయీ గ్రామాన్ని దర్శించుకున్నారు. వారిని కంట్రోల్ చెయ్యడం ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. మూడురోజుల తరువాత పెట్రోల్‌తోపాటు మంచినీరు పూర్తిగా ఇంకిపోయింది. ఆ తరవాత ప్రభుత్వాధిఖారులు ఎంత లోతు తవ్వించినా పెట్రోల్‌గానీ, నీరుగానీ ఆ బావుల్లో మళ్ళీ కనపడలేదు. (ఈ విషయంలో చాలా కాంట్రవర్సీలు వచ్చాయి. కొందరైతే ఇదంతా ఓ పుకారు అని బీహార్‌లోనే కోట్టివేశారు. కొందరైతే, పెట్రోల్‌ని బ్లాకులో అమ్ముకునేవారు. ఏ రాత్రో ప్రభుత్వాధికారాలకి భయపడి ఆ బావుల్లో టాంకుల్ని ఖాళీచేసుంటారని కూడా పుకార్లు పుట్టాయి)

చాలా చాలా ఫైల్స్ ఇటువంటి వింత సంఘటనల గురించినవే.

దీర్ఘంగా నిట్టూర్చాడు గోర్కీ. ఇటువంటి విషయాలు ఎందుకైనా, ఎక్కడైనా జరగొచ్చు. జరగడానికి కారణాలు ఉండవచ్చు. అవి కనుక్కోవడమ్లో మనిషీ, సైన్సు కూడా సక్సెస్ సాధించనూ వచ్చు. ఓడిపోనూవచ్చు. వీటిని పరిశోధించడానికి ఖండాలు దాటి రావల్సిన పనిలేదు.

‘లోకల్ ఇంటెలిజెన్సియా’ తలుచుకుంటే చాలు. గోర్కీ సైలంటయ్యాడు.

“ఆర్ యూ నాట్ హేపీ విత్ ద రిపోర్ట్స్?” కవ్విస్తున్నట్టుగా అన్నాడు హోవర్డ్ డాంటే.

“యస్. ఐ యామ్ నాట్ హేపీ విత్ ద రిపోర్ట్స్” సూటిగా అన్నాడు గోర్కీ.

"వై?" అడిగాడు రాజోవ్‌స్కీ.

"ప్రొఫెసర్ బ్రూక్స్ ప్రకారం ఇవన్నీ ఒకే దేశంలోనో ఒకే రాష్ట్రంలోనో ఒకే ఖండంలోనో జరగలేదు. ఒక సంఘటనకీ, మరో సంఘటనకీ చాలా గ్యాప్ ఉంది. చిత్రం ఏమంటే, ఆ చితాభస్మాల్ని ఎవరూ క్లెయిమ్ చెయ్యలేదు వైట్ రాక్ లేక్ ఇష్యూ అయితే పేలిపోయినవారి పేర్లూ వారి ఫోటోలూ వేన్ నంబరూ అన్నీ ఉన్నై. కానీ వారి బంధువులమనిగానీ, స్నేహితులమనిగానీ ఎవ్వరూ రాలేదు. మరొకటి ఏమంటే, ఇటువంటి సంఘటనల వల్ల ప్రపంచానికి వచ్చే ముప్పు ఎంతది? మరో విషయం, భారతదేశం చాలా విశిష్టమైనది. మా సంవత్సరాల పేరు 60 సంవత్సరాలకొకసారి రిపీట్ అవుతాయి. ఫర్ ఎగ్జాంపుల్ ఈ సంవత్సరం పేరు ప్రభవ అయితే 60 సంవత్సరాల తరువాత వచ్చే సంవత్సరం పేరు మళ్ళీ ప్రభవే అవుతుంది. సరే సంవత్సరాలు అలా రొటేట్ అవుతాయి. అప్పుడు కూడా యీ సంఘటనలు పక్కా క్రమ పద్ధతిలో జరగలేదు. అయిదేళ్ళు అటూ ఇటుగా వున్నాయి" ఆగాడు గోర్కీ.

"యూ ఆర్ రైట్. కొంత సమాచారం మేం విడిగా దాచిన మాట వాస్తవం. మీ దగ్గరేకాదు. మా ప్రభుత్వాలకి కూడా తెలియదు. ఆరోవిల్ మేరీ ఒక ఉత్తరం వ్రాసింది, భస్మం అయిపోయే ఆరువారాలముందు. తాను అర్ధాంతరంగా భస్మం అయిపోతాననీ, ఆ విషయం ఓ ఆత్మ తనతో చాలాసార్లు చెప్పిందనీ, ఆ ఆత్మపేరు 'రోసెల్లీ' అనీ, ఆ రోసెల్లీ చిన్నప్పుడే

చనిపోయిన తన నేస్తం అనీ, తన ఆస్తినంతా కేథలిక్ చర్చికి ఆల్‌రెడీ రాసి, రిజిస్టర్ చేశాననీ. ఆ ఉత్తరం మాకు ఆమె బైబిల్ పుస్తకంలో దొరికింది. మూఢనమ్మకాల్ని స్ప్రెడ్ చెయ్యడం ఎందుకని ఆ ఉత్తరం విషయం మేం రహస్యంగానే ఉంచాం. మళ్ళీ మళ్ళీ మళ్ళీ మళ్ళీ ఆవిడ గురించి మేం పరిశోధించాం. ఆమెకి ఓ స్నేహితురాలుంది. ఆమెని కలిస్తే చెప్పింది, 'ఆరోవిల్‌కి రోసెల్లీ ఆత్మ కనిపించడం మొదటిసారి కాదనీ, జరగబోయేది ముందే రోసెల్లీ ఆరవిల్‌కి చెబుతుందనీ' చెప్పింది. మరో విషయం ఏమంటే, ఆరోవిల్ తన తరువాతి జన్మ భారతదేశంలో అని అన్నదట. ఇలా చాలా కేసుల్లో మాకు దొరికిన సమాచారం విశ్లేషిస్తే, మాకు అర్ధమయింది యీ ఆత్మలన్నీ జీవుల్ని మృత్యువు వైపు నెడుతున్నాయి. తరువాత జన్మ భారతదేశంలోనే అని వారికి నమ్మకం కూడా కలిగిస్తున్నాయి. ఆగి, దీర్ఘంగా శ్వాస తీసుకున్నాడు రాజోవ్‌స్కీ.

"యస్ మీదేశాన్ని ' మిస్టరీ లాండ్ అని అంటారుగా" చిన్నగా నవ్వి అన్నాడు స్టిట్సన్.

"ప్రతిదేశానికీ ఏదో ఓ పేరుంటుంది బ్రదర్. మనిషి జీవితమే ఓ మిస్టరీ. విషయానికి వస్తే కొన్ని కొన్ని ఇండియన్ లేక నాన్ ఇండియన్ ఆత్మలు రోసెల్లీ వంటీ ఆత్మల్ని లోబరుచుకుని వారితో ఆరోవిల్‌లాంటి మనుషులకు ఫ్యూచర్ చెప్పించి మృత్యువుకి సిద్దం చేస్తున్నాయని మీ ఆలోచనగా నాకు తోస్తోంది. మై డియర్ ఫ్రెండ్స్ 'ఫిలాసఫీ అంటే, ద ప్యూరెస్ట్ ఫామ్ ఆఫ్ సైన్స్' అని ఎందరో భారతీయ మహాగురువులు ప్రపంచానికి చాటారు. ఆ విషయం పక్కన పెడితే, మీరు నన్ను ఇక్కడికి పిలిపించాలని ప్రయత్నించిన మాట నిజం. సరైన మార్గదర్శనం లేకుండా నేనెలా ఇక్కడికి వస్తానో అని అనుక్షణమూ నా మీద కన్ను వేయడం నిజం. ఏం చెప్పాలో అది చెప్పకుండా, బీట్ ద బుష్ లాగా , నాలుగు అసంపూర్ణ ఫైల్సు నా ముందు పడేసి నన్ను టెస్ట్ చెయ్యబోవడం ఇంకా నిజం. ఐ థింక్ వియ్ హావ్ వేస్టెడ్ ఇనఫ్ టైమ్" అందరివంకా మార్చి మార్చి చూసి అన్నాడు గోర్కీ.

"గుడ్.. నువ్వన్నవన్నీ కరెక్టే. అలాగని నీ ముందు మేము పెట్టిన ఫైల్స్ ఫేక్‌వి కాదు. అవన్నీ స్వచ్ఛమైన నిజాలు. బ్రదర్, ఆత్మలూ ఫ్లైయింగ్ సాసర్స్ వున్నాయా లేవా అనే చర్చ యీనాటిది కాదు. ఉన్నాయని ఒప్పుకోలేము. లేవని పూర్తిగా కొట్టిపారాయనూ లేము. రోసెల్లీ ఆత్మ ఒకటేకాదు. లైఫ్ ఆఫ్టర్ డెత్ (మరణం తరవాత జీవితం) గురించి చాలా చాలా సమాచారం ఇప్పటికే సేకరింపబడి వున్నది. మంత్రాల గురించి కూడా బోలెడంత సమాచారం వుంది. అస్త్ర శస్త్రాల గురించీ చెప్పలేనంత సమాచారం వుంది. ముఖ్యమైన సమాచారం ఏమటే, రామాయణ, మహాభారత కాలాల్లో వాడబడిన ఆయుధాలు, అస్త్ర శస్త్రాలు, ఆభరణాలు, అప్పుడు మృత్యువు పాలైన వారి ఆత్మలు రాబోయే ఘోరాతి ఘోరమైన ముప్పు, మానవాళికి వీటీనించే వస్తుందని ప్రాక్ పశ్చిమ మేధావి వర్గం సమ్యుక్తంగా ఘోషిస్తోంది. అంతేకాదు నేటి మానవులు 'స్వీయరక్షణ' పేరుమీద తయారించుకున్న అణ్వస్త్రాలు. ఇక క్షిపణుల సంగతైతే చెప్పక్కర్లేదు. ఉగ్రవాద దేశాలు, ముఠాలు ఉద్రేకంతో ఊగిపోతున్నాయి. ఎప్పుడు అటమిక్ వార్ బ్రేకవుతుందో ఎవడికీ తెలియని పరిస్థితి. ఆ విషయం సామాన్యులకే

కాదు. దేశాధినేతలకీ తెలియదు. ఒకవేళ ఆత్మలు శరీరాల్ని లోబరుచుకుని అశాంతి, యుద్ధాలు సృష్టించడం మొదలు పెడితే మానవాళి పూర్తిగా మిగలదు. మానవజాతి సమస్తం భస్మీపటలం అయిపోతుంది. పైపైకి ఇదో మహా సమస్య అయినట్టు కనిపించకపోయినా క్షణాల్లో యీ సమస్య మీ వామనుడిలాగా అంతరిక్షాన్ని ఆక్రమించవచ్చు. ఖచ్చితంగా ఫలానా చోటునించి పరిశోధన మొదలు పెట్టవచ్చు అనే ఆలోచన కూడా మాకు తోచట్లేదు. నీకు హార్డిల్స్ పెట్టింది నీ మేధో, శారీరక బలం యీ సమస్యా పరిష్కారనికి ఎంతవరకూ పనికొస్తుందని. నీమీద మాకు సంపూర్ణమైన నమ్మకం వచ్చింది. మమ్మల్ని నీవూ 100% నమ్మొచ్చు. ఇప్పుడు చర్చిద్దాం.ఓకె?" గ్లాసుల్లో తలో లార్జ్ పోసి ఐస్ క్యూబ్స్ వేసి అన్నాడు పీటర్ స్టిట్సన్. రిలాక్స్‌డ్‌గా వెనక్కి వాలి గ్లాస్ అందుకున్నాడు గోర్కీ.

"మబ్బులు కొన్ని విడివడ్డాయి. ఆకాశం ప్రస్తుతానికి నీలంగా, క్లియర్‌గా వుంది. అలా ఎన్ని నిముషాలు, ఎన్ని గంటలుంటుందో తెలిసింది ఎవరికీ? వెల్.. ప్రస్తుతానికి సమాచారం ఇచ్చిపుచ్చుకోక తప్పదు" మనసులో అనుకుంటూ గ్లాస్‌లోని విస్కీకి ఐస్ క్యూబ్స్‌కీ కొంచెం వాటర్ కలిపాడు.

"నౌ... ద రియల్ ఛీర్స్" అన్నాడు రాజోవ్‌స్కీ.

"యా" నవ్వాడు డాంటే .

నల్లమల అడవుల్లో మళ్ళీ ఓ అకారణ వర్షం మొదలైంది. పుట్టల్లోని ఎలుకలూ పాములూ అన్నీ హడావిడిగా బైటికి రాసాగాయి. అప్పటివరకూ నక్కలు తవ్విన బొరియల్లో నిద్రిస్తున్న రెండు ముంగిసలు తటాల్న బయటికొచ్చాయి. వాటి కదలికలోనే ఓ గగుర్పాటు. ఎంత వాసన పట్టగలిగే జీవులైనా వర్షపు గాలిలో వాసనని త్వరగా పసిగట్టలేవు. ఒక్కో ముంగిసా కాళ్ళమీద (వెనక కాళ్ళమీద) నిలబడితే రెండున్నర అడుగుల ఎత్తు ఉంది. తోకమీద కూర్చుని ఆ రెండూ వాసన పట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ముంగీసలు వాటి బొరియల్ని అవే తవ్వుకుంటాయి. కానీ అప్పుడప్పుడూ నక్క బొరియల్లోనూ చెట్ల బొరియల్లోను (బోదెల్లో) పడకేస్తాయి. ఆ వర్షంలోనే అవి జంటగానే తూర్పువైపుకి పరిగెత్తాయి. ఏదో సుగంధంలాంటి వాసన. పాములకీ, ముంగిసలకీ పురాణ వైరం. నేలంతా చిత్తడి చిత్తడిగా  ఉంది. గోళ్ళ పట్టు ఎంత పెంచినా జారుతూనే ఉంది. ఎదురుగా ఎలుకలు వంటి ఆహారానికి పనికొచ్చే జీవులున్నా అవి పట్టించుకోలేదు. వేగంగా దూకుతూ దుముకుతూ రాళ్ళ గుట్టల్లాంటి గుట్టల దగ్గరికొచ్చాయి. రాత్రి మొదటి ఝాము. చిమ్మ చీకటిలో పరుగు. వర్షం భీభత్సమైంది. వర్షరాణి విన్యాసాలు భయంకరంగా సర్ప నృత్యాలూ, అదీ కుబుసం విడిచి ఆకలితో ఊగిపోతున్న మహాసర్ప నృత్యంలా ఉంది. ఫెటేల్న ఓ పిడుగు.. మెరుపుల వరుసలు. పిడుగు పడ్డచోట రాళ్ళు, గులక రాయంత పరిమాణంలో ఎగజిమ్మాయి. ఆ రాళ్ళు బంగారు రంగుతో మెరిశాయి. మరో పిడుగు, మరో మెరుపుల వరస. ఓ మహా సర్పం తోక మీద నిలబడ్డది. ముంగిసలు పాము మీదకి దూకబోయి వెనక్కి తిరిగి పరుగుని అందుకున్నై. విపరీతమైన వేగంతో నాలుగు దిక్కుల వైపూ పడగ సారించి వూత్కారం చేసింది. నిద్రపోతున్న మధుర కలత నిద్రలో కెవ్వుమంది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments